


ఏడు కొండలు ఎత్తుగా వుంటాడు, ఎర్రగా వుంటాడు. యమ స్టైల్‌గా వుంటాడు, ఎవర్ గ్రీన్‌గా వుంటాడు!

అతనికి బ్యాంకు ఆఫీసర్ ఉద్యోగం వుంది–బజాజ్ చేతక్ వుంది, బజారు వీథిలో ఇల్లుంది!

ఇవన్నీ ప్లస్ పాయింట్లయితే మైనస్ పాయింట్ శివరాత్రి దగ్గర పడుతున్నా అతనింకా ఎఛీవ్ చేయలేని ఇయరెండ్ డిపాజిట్ టార్గెట్!

అవును–అతనో చిన్న జాతీయ బ్యాంకు బ్రాంచి ఇన్‌ఛార్జ్–మరో నెలా పదిహేను రోజుల్లో ముప్పై లక్షల రూపాయలు అదనంగా అతను సేకరించాలి! ఈ టార్గెట్‌ను ఛేదించగలిగితేనే అతనికి ప్రమోషన్లు, కోరుకున్న చోటకి ట్రాన్స్‌ఫర్లు!

"కిటికీ అలంకరణ" చేయొద్దు!

"ఆఖరి క్షణం పదిహేను రోజులకి పది లక్షల చొప్పున ఇప్పటి నుంచే సేకరించు!" అంటూ పై అధికారుల దగ్గరనుంచి రోజూ అతనికి పర్సనల్ నేమ్ మీద ఉత్తరాలొచ్చిపడి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి!

అతని బ్రాంచీ వున్నది, జిల్లా కేంద్రానికి పదిహేను మైళ్ళ దూరంలో పల్లెలో! అతనుంటూన్నది– ప్రత్యేక పర్మిషన్‌తో జిల్లా కేంద్రంలో–"మీ బ్రాంచ్ ప్రగతిని వేయికళ్ళతో కనిపెట్టుకుని వున్నాం– ఏమాత్రం తేడా పాడా కనిపించినా మిమ్మల్ని ఆ పల్లెలోనే నివసించమని ఆదేశించగలం!" అంటూ కంట్రోలింగ్ ఆఫీస్ నుంచి వచ్చే బెదిరింపు ఉత్తరాలు కూడా అతడిని కలవరపెడుతూ వుంటాయి!

ఎల్లకాలం కరువు బరువుతో కాలం వెళ్ళదీసే ఆ రాయలసీమ పల్లె ప్రజల నుంచి లక్షలకు లక్షలు డిపాజిట్లు సేకరించగలగడం అనేది కల్లోమాట! జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ డిపార్ట్‌మెంట్లని ఆశ్రయించక తప్పదు! అయితే వాళ్ళని డిపాజిట్లకోసం దేబిరించడం అంటే ఏడుకొండలకి ఏడుపు పర్యంతం అవుతుంది! డిపార్ట్‌మెంట్ వాళ్ళకి పార్టీలివ్వాలి, ప్రెజెంటేషన్లివ్వాలి, నియమాలకు తిలోదకాలిచ్చి లోన్లివ్వాలి! ఇన్నీ ఇస్తే ఓ రెండు లక్షలిచ్చినా, రెండు వారాలు తిరక్కుండానే ఫండ్స్ అవసరం అంటూ డ్రా చేసేస్తారు–అసలు పల్లె బ్రాంచీల్లో ఫండ్స్ వుంచకూడదంటూ జి.ఓ. వచ్చిందంటారు!

ఏడుకొండలకి తెలుసు–తనకన్నా తలమాసిన మరో బ్యాంకు మేనేజరు వాళ్ళ వలలో చిక్కి వుంటాడని! అసలు బ్యాంకులన్నీ గవర్నమెంటువే–ఆ నిధులన్నీ గవర్నమెంట్‌వే! అటువంటప్పుడు ఆ నిధులు ఏ బ్యాంకులో వుంటేనేం? గవర్నమెంట్‌కి కొత్తగా ఒరిగేదేం వుంటుంది?

"అసలు ఇయరెండ్ టార్గెట్ నిర్ణయించేటప్పుడు గవర్నమెంట్ ఫండ్స్ లెక్కల్లోకి తీసుకోకూడదు!" బ్రాంచి ఇన్‌ఛార్జ్ అయిన ఈ 240 రోజుల్లో 480వ సారి అదేమాట అనుకున్నాడు ఏడుకొండలు!

ఇక ఇలా లాభం లేదని జిల్లా కేంద్రంలో ఇంటింటికెళ్ళి ముఖాముఖీ ప్రజల్ని కలిసి, మీ ఇంటిగుమ్మంలోకి బ్యాంకు వచ్చిందని చెప్పి, అక్కడికక్కడ డిపాజిట్ రసీదులు రాసి ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చాడు ఏడుకొండలు!

బ్యాంకులో ఆఫీసర్ ఉద్యోగం వచ్చి ఆరేళ్ళయినా ఇంకా పెళ్ళి చేసుకోలేదు ఏడుకొండలు–ఒకటో స్కేలు నుంచి రెండో స్కేలులోకి వెళ్ళాకే తన జీవితంలోకి మరో మనిషిని ఆహ్వానించడం అని అతను గట్టి నిర్ణయం తీసుకున్నాడు! అందుకే టార్గెట్ స్మాష్ చేయాలని ఎక్కడ లేని తిప్పలు పడుతున్నాడు.

శని, ఆదివారాల్లో ఒక టైంటేబుల్ ప్రకారం ఒక వర్గం ప్రజల్ని కలవాలని నియమం పెట్టుకున్నాడు–ఓ రోజు డాక్టర్లని, ఓ రోజు లాయర్లని, ఓ రోజు టీచర్లని, ఓ రోజు గృహిణులని–ఇలా అన్నమాట!

ఎక్కువగా వంద రూపాయల రికరింగ్ డిపాజిట్ అడిగితే లక్ష రూపాయల లోన్ అడిగే ప్రబుద్ధులే ఎదురుపడుతూ వుంటారు–ఈ అనుభవం ఏడుకొండలకి కొత్తేం కాదు!

ఆ రోజు శనివారం–తొమ్మిదింటికల్లా ట్రిమ్‌గా తయారయి ప్రత్యేకంగా డాక్టర్లని కలవాలని గవర్నమెంట్ హాస్పిటల్‌కి వెళ్ళాడు అతడు.

ముందుగా డాక్టర్ ఆనందరావు గదిలోకి వెళ్ళాడు.

"అయామ్ ఏడుకొండలు–ఆఫీసర్ ఆఫ్ సో ఎన్డ్ సో బ్యాంక్–సో ఎన్డ్ సో బ్రాంచ్!" ఆ వి.డి.-కమ్- స్కిన్ స్పెషలిస్ట్‌తో చేయి కలపడానికి మనసొప్పకపోయినా చేయి చాపాడు నోటిని పంజాబ్ నుండి అస్సాం వరకు సాగదీస్తూ!

"హల్లో–కూర్చోండి–ఏమిటి ప్రాబ్లమ్–ఎక్కడ?" ఏడుకొండల్ని నఖశిఖ పర్యంతం గుచ్చి గుచ్చి చూస్తూ అడిగాడు డాక్టర్!

ఏడుకొండలు కుర్చీలో ఇబ్బందిగా మెలికలు తిరిగిపోతూ "అబ్బే! చెకప్ కోసం రాలేదండీ–అయామ్ ఆల్‌రైట్–మా బ్యాంకు మీద మీ పాట్రనైజ్‌కి థాంక్స్ చెబుదామని వచ్చాను!" అన్నాడు గబగబా.

"మీ బ్యాంకులో నాకు అకౌంట్ కూడా వున్నట్లు లేదు!" బుర్ర గోక్కున్నాడు డాక్టర్.

"ఇప్పుడు ఓపెన్ చేస్తారుగా–మేం చెప్పుకోవడం కాదుగానీ మీ సేవకై తపించే బ్యాంక్ మా బ్యాంక్– మీ శ్రేయస్సుకై శ్రమించే బ్యాంక్ మా బ్యాంక్–మీ ఆనందమయ జీవితానికి ఆరంభం–మా బ్యాంకులో ఖాతా ప్రారంభం!"

డాక్టర్ గట్టిగా ఆవులిస్తూ టైం చూసుకునేసరికి తమ బ్యాంకు స్తోత్రం కట్టిపెట్టక తప్పలేదు ఏడుకొండలకి!

"ఇంతకీ మీరొచ్చిన పని..."

ఎం.బి.బి.ఎస్. వెలగబెట్టిన డాక్టరు ఇంకా తన రాకలోని అంతరార్థం గ్రహించలేదంటే నమ్మడానికి చెవిలో కాలిఫ్లవర్ పెట్టుకునిలేదు ఏడుకొండలు!

అయినా ఓ వెర్రి నవ్వు నవ్వి "మీరు ఎలాగైనా ఓ పదివేలు మా బ్రాంచ్‌లో డిపాజిట్ చేయాలి. మీరు అంత దూరం రానవసరం లేదు–డి

పాజిట్ రిసీప్ట్ ఇక్కడే అందిస్తాను-తెలుసుకదా మాకుండే టార్గెట్ హెడేక్! మరో ముప్పై లక్షల గ్యాప్ వుంది!" అన్నాడు.

'టార్గెట్' మాట వినగానే డాక్టర్ గారు ఆలోచనలో పడిపోయారు.

"మీకెంతమంది పిల్లలు?" అనుకోని ప్రశ్నకు నిర్ఘాంత పోయాడు ఏడుకొండలు-"నాకింకా పెళ్ళి కాలేదండీ!"

"ఐయామ్ సారీ-అయితే మీకు నేనేమీ డిపాజిట్ ఇచ్చేది లేదు!"

"అదేంటండీ?" తెల్లబోయాడు ఏడుకొండలు-

"మీరిచ్చే డిపాజిట్టుకు నా పెళ్ళితో లంకేంటి?"

"మీ టార్గెట్‌లలాగే మాకూ టార్గెట్‌లుంటాయి-నెలకి పాతిక మందికి ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు చేయించాలి! ఈ నెల నా టార్గెట్ స్మాష్ చేయాలంటే మరో నలుగురు కావాలి! మీకిచ్చే పదివేల డిపాజిట్ పెళ్ళయి పిల్లలున్న బ్యాంకు మేనేజరుకిస్తే నా టార్గెట్‌కి అతను సహాయంచేసినట్టూ అతని టార్గెట్‌కి నేను సహాయం చేసినట్లూ-అవుతుంది" ఇక నీతో మాట్లాడే పనేం లేదన్నట్లుగా ఫోన్ అందుకున్నాడు డాక్టర్!


తన టార్గెట్ ఎలా సాధించాలో అర్థంగాక జుట్టు పీక్కుంటూ ఆస్పత్రి గేటు దాటి ఎదురుగా వున్న ఎలిమెంటరీ స్కూలు వైపు ఆశగా అడుగులు వేస్తున్నాడు ఏడుకొండలు-ఈ దేశంలో .అందరూ అసూయపడే ఓ బ్యాంకు ఆఫీసర్!

గోదావరీ పావనోదారవాఃపూర
మఖిల భారతము మాదన్ననాడు
తుంగభద్రా సముత్తుంగ రావముతోడ
కవులగానము శ్రుతి గలయునాడు
పెన్నానదీ సముత్పన్న కైరవదళ
శ్రేణిలో తెన్గు వాసించునాడు
కృష్ణాతరంగ నిర్ణిద్ర గానముతోడ
శిల్పమ్ము తొలిపూజ సేయునాడు

అక్షరజ్ఞాన మెఱుగదో యాంధ్రజాతి
విమల కృష్ణానదీ సైకతములయందు
కోకిలవుబాట విప్పుక గూండ్లుకట్టి
నేర్చుకొన్నది పూర్ణిమానిశలయందు!

— విశ్వనాథ

# శవయాత్ర



శబ్దం అంతర్థానమవుతున్న కాంతిలా అంతరించిపోవడం
నిశ్శబ్దం వినబించే స్వచ్ఛమైన సంగీతాన్ని ద్వేషించే తత్త్వమేదో
దాని గొంతు నులిమి చంపడం చూస్తూనే ఉన్నాం
అక్కడెక్కడో ఒక శ్మశానం చుట్టూ నిలబడి తమ చూపులతో మనసుల్ని వేటాడి
వాటిని సుఖాలతో బాధపెట్టడానికి ఆశ ఎరచూపే స్వార్థం
ఆశరోగం పట్టుకున్న జనులకి స్వార్థమే పరమార్థంగా కనిపిస్తుంది
అందుకే స్వప్నాల్లో మస్తిష్కాలు బందీ అయిపోతూ ఉంటాయి
మనుషుల మనసులు వాటికవే తెచ్చిపెట్టుకున్న రోగాలతో బాధపడ్తూ ఆసుపత్రికి
ప్రయాణం కట్టేస్తాయి
తాము ఇంతవరకూ తలదాచుకున్న వృక్షం వీణలా మధురమైన సంగీతం వినిపిస్తున్నా
చెట్టు ప్రతీ ఆకూ ప్రతీ పువ్వూ కన్నీటిని విడుస్తున్నా
ఊరి మనసు తన వక్షం మీద శిథిలమైన చేతులతో బాదుకుంటున్నా
ఆకాశంలో కనిపించే ఉరికి వ్రేలాడితే స్వర్గానికి చేరవచ్చునన్న ఆశలు
సిరిని కాంక్షించే కోరికలై కోకిలలై వసంతాన్ని విడచి ఎగిరిపోతూ ఉంటాయి
పల్లెని ఆవరించిన ఆకాశం ఆవేశంగా తనని దాటి ఎగిరిపోతున్న పక్షుల్ని ఆగిపోమని
ఆవేదనతో వాటిని పట్టుకోవడానికి చేతులు లేని తన భుజాల్ని చాపుతుంది
మనసుని అర్థంచేసుకోలేని మనుషులకి ఆ ఆకాశం కేవలం ఒక శూన్యంలానే కనిపిస్తుంది
అసలు శూన్యమంతా ఆకాశంపైనే ఉందని ఆ శూన్యాన్నుంచి ప్రకృతిని ఆకాశం పరిరక్షిస్తుందని
వాళ్ళకి తెలియదు.
కడుపు నిండక పొట్ట చేత పట్టుకొని పట్నం పోయే పల్లెజనాన్ని చూసి జాలిపడుతోంది ఆకాశం
ఖాళీ ఇనప్పెట్టెని కడుపులో దాచుకుని పట్నం పోయే స్వార్థపరుల్నీ చూసి జాలిపడుతోంది ఆకాశం
మనుషుల మధ్య ప్రేమ ఉంటే ఎన్ని వేల కడుపులైనా ఇక్కడే నిండుతాయి
మనిషి అంతరాత్మలో సంతృప్తి ఉంటే ఎన్ని కోట్ల సంపదైనా అతని మనసులోనే నిండుతుంది
హృదయాల వంటి నివాసాల్ని విడిచి హృదయాలు లేని ఆకాశహర్మ్యాల్లోకి ప్రవాసిస్తున్న జనాన్ని చూసి
బాధతో కుమిలిపోతుంది ఊరి పొలిమేర
కడుపులో ఆకలికంటే కళ్ళల్లో ఆకలి నిండుకున్న ప్రజలకి ఊరి కడుపు తీపి గురించి తెలుస్తుందా?
రాతి చెట్టుపైన రాక్షసిలా వాలిన గ్రద్ద రోజుకో రోడ్డు సర్పాన్ని ఓ కొత్త నివాసంలోకి జారవిడుస్తూనే ఉంది
ప్రవాసములా శ్మశానంలోకి సాగిపోతూనే ఉంది
శ్మశానంలో సంపదతో నిండిన పిరమిడ్ల క్రింద అన్నం మెతుకులు వెదుక్కుంటున్న కళేబరాలు
స్వచ్ఛమైన ప్రకృతినిండా అనాథగా ఏకాకిగా, అబలగా, భర్తపోయిన స్త్రీలా బిడ్డల్ని కోల్పోయిన తల్లిలా
గ్రామం
ప్రేమంతా అక్కడే ఉంది. ఆ గ్రామంలోనే,
గ్రామం ఒక మహా హృదయంలా తన నుండి వేరైన రక్త బంధువులు తిరిగి తనలోకి చేరతాయన్న ఆశతో
కొట్టుకుంటూనే ఉంది
చావు లేని ప్రేమ మరణాన్ని జయించి తనని వదిలి వెళ్ళి మరణంలో బ్రతుకుతున్న జీవితాల్లోకి
ప్రాణం నింపాలని నిరీక్షిస్తూనే ఉంది
సజీవ దహనమైపోతున్న తన బిడ్డలు రుద్రభూమి నుండి తిరిగి తన పరిష్వంగంలోకి వస్తారని ఎదురు
చూస్తోంది పల్లె స్వర్గం
స్వార్థం ఎరకి చిక్కిన జనులు నిర్జీవులై కొందరు, జీవచ్ఛవాలై కొందరు, జంతువులై కొందరు
చిత్రం, స్వార్థం దృష్టి హృదయం మీదే పడింది
నరకమే స్వర్గంలో స్థావరాన్ని ఏర్పరచుకోవడానికి సంసిద్ధమవుతోంది
ప్రవాసం రెండు తలల సర్పంలా ప్రకృతిని కబళిస్తూనే ఉంది
అది ప్రవాసం కాదు
మనిషి తనని తాను కోల్పోవడానికి చేసే నికృష్ట సాహసం
అభివృద్ధి అనే కృత్రిమ పండగ ప్రతీరోజూ ప్రపంచం జరుపుకుంటోంది, కానీ
ఎటు చూసినా శవయాత్రే!

— జాస్తి రామకృష్ణచౌదరి